మావిళ్ల సైదులు (ఫైల్)

తాను కన్ను మూసి.. ఇంకొందరికి వెలుగునిచ్చి..

మన్సూరాబాద్, జనవరి 8: బ్రెయిన్ డెడ్ అయిన ఓ వ్యక్తి తాను మరణిస్తూ మరి కొందరికి ప్రాణం పోశారు. వివరాల్లోకి వెళ్తే.., నల్గొండ జిల్లా, పెద్దవూర మండలం, పులిచెర్ల గ్రామానికి చెందిన మావిళ్ల సైదులు (33) వ్యవసాయం చేస్తుంటాడు. ఈ నెల 5న ఉదయం 10:30 గంటల సమయంలో ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం అతడిని నగరానికి తీసుకువచ్చి ఎల్బీనగర్ లోని కామినేని దవాఖానలో చేర్పించారు. రెండు రోజుల పాటు చికిత్స అందించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. ఈ నెల 7న రాత్రి 9:29 గంటల సమయంలో సైదులుకు బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. విషయాన్ని తెలుసుకున్న జీవన్ ధాన సంస్థ ప్రతినిధులు సైదులు భార్య జ్యోతితో పాటు కుటుంబ సభ్యులను కలుసుకుని అవయవ దానంపై అవగాహన కల్పించారు. బ్రెయిన్ డెడ్ అయిన అతడి అవయవాలను దానం చేసినట్లయితే మరి కొందరికి జీవితాలను ప్రసాదించవచ్చునని జీవన్‌ధాన్ సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. పుట్టెడు దుఃఖంలో ఉండి సైతం వారు మరి కొందరికి ప్రాణం పోసేందుకు ముందుకు వచ్చారు. సైదులుకు చెందిన రెండు కిడ్నీలు, లివర్, రెండు కార్నియాలను దానం చేశారు.

40వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య
- నిర్లక్ష్యం చేస్తే.. ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరిక

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో త్వరలో విడుదల కానున్న మెగా డీఎస్సీలో 40 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం బీసీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేస్తుంటే.. విద్యా శాఖకు చెందిన కొందరు అధికారులు మాత్రం 10వేలు, 12 వేలు అంటూ లెక్కలు వేస్తున్నారంటూ మండిపడ్డారు. విద్యా శాఖలో వాస్తవంగా ఎన్ని ఖాళీలు ఉన్నాయో తక్షణమే లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పీఆర్‌సీ కమిటీ నివేదికలో పొందుపరిచినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 16వేల విద్యా వాలంటీర్లను రెండు సంవత్సరాల నియమించారని, ఈ విద్యా సంవత్సరంలో కూడా విద్యా వాలంటీర్ల నియామకం కోసం ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిందన్నారు. స్కూల్ అసిస్టెంట్ల కోసం పోస్టులు ఖాళీగా లేకపోతే.. స్పెషల్ టీచర్లు ఎందుకని ప్రశ్నించారు. 10 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం వల్ల డీఎస్సీ ద్వారా మరో 10 వేల ఖాళీ పోస్టులు భర్తీ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. టీచర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, లేనిపక్షంలో బీసీ ఉద్యోగుల సంఘం తరుపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎంపీ ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నీల వెంకటేశ్, సంఘం ప్రతినిధులు గుజ్జ కృష్ణ, సి.రాజేందర్, జిల్లపల్లి అంజి, గోరెగే మల్లేశ్ యాదవ్, అనంతయ్య, పి.సుధాకర్, జి.కృష్ణయాదవ్, నందాగోపాల్, కోటేశ్వరి, మోడీ రాందేవ్, ఉదయ్, లింగయ్య యాదవ్, నిమ్మల వీరన్న, శ్రీమాస్, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులు ఇవే..

- పీఆర్‌సీ నివేదిక ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో పదవీ విరమణ వల్ల ఏర్పడిన 24 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి.
- ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 4900 పోస్టులు భర్తీ చేయాలి.
- ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 10వేల పీఈటీ పోస్టులను కూడా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి.
- ప్రభుత్వ పాఠశాలల్లో గత 20 సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న 5వేల ఆర్ట్–క్రాఫ్ట్ డ్రాయింగ్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి.
- ప్రతి ఉన్నత పాఠశాలకు ఒక కంప్యూటర్ చొప్పున 4వేల ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు పంపించాలి.
- ప్రతి పాఠశాలకు ఒక జూనియర్ అసిస్టెంట్ ఉండాలి.
- అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్ల నియామకం చేపట్టాలి. దాదాపు 15 వేల అటెండర్, స్వీపర్ పోస్టులు భర్తీ చేయాలి.

మంత్రి తుమ్మలకు శాలువా కప్పి సత్కరిస్తున్న శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు

చేనేత కళాకారులకు ప్రభుత్వం అండ

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మాదాపూర్, జనవరి 8: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీని కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విచ్చేసి నిర్వాహకులతో కలిసి సోమవారం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కళాకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదన్నారు. చేనేత కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ల వేళలా అండగా నిలుస్తుందన్నారు. ఇందులో భాగంగా డెవలప్‌మెంట్ ఆఫ్ కమిషనర్ హ్యాండీ క్రాఫ్ట్స్ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనకు పలు ప్రాంతాలకు చెందిన హస్తకళాకారులు విచ్చేసి వారి ఉత్పత్తులను ప్రదర్శించారు. ఇందులో భాగంగా ఫోక్ పెయింటింగ్, బస్తర్ ఐరన్ క్రాఫ్ట్స్, జారీ జర్దోసీ, జ్యువెలరీ, హ్యాండ్ ప్రింటెడ్ డ్రెస్ మెటీరియల్స్, చీరలు టెర్రకోట, లేస్ వర్క్స్, టై అండ్ డై, బిద్రి క్రాఫ్ట్స్, సీతల్ పట్టీ, బాంబూ, సిల్వర్ పిలిగ్రీ, బోమ్మలు, డ్రై ఫ్లవర్స్ వంటి ఉత్పత్తులను ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. ఇందులో పావని, శ్రీలత శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. బీరప్ప బృందం ఒగ్గుడోలు ప్రదర్శన ఆద్యంతం అలరించింది.

బంగారు పతకాలు అందుకున్న విద్యార్థిని స్నేహ

బీఫార్మసీ విద్యార్థికి మూడు బంగారు పతకాలు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 8 : బి ఫార్మసీలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఎన్ ఎన్ఆర్‌జీ కళాశాల విద్యార్థిని జి.స్నేహ జేఎన్‌టీయూ నుంచి మూడు బంగారు పతకాలను సాధించింది. చౌదరిగూడలోని నల్ల నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీ ఫార్మసీ చదువుతున్న గుత్తికొండ స్నేహ అత్యుత్తమ ఫలితాలు సాధించి రికార్డు సృష్టించినందుకు గాను సోమవారం జేఎన్‌టీయూ చాన్సలర్ నర్సింహా రెడ్డి, రెక్టర్ గోవర్ధన్ నుంచి మూడు బంగారు పతకాలు అందుకున్నది. స్నేహను కళాశాల చైర్మన్ నల్ల నర్సింహా రెడ్డి, డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి సన్మానించి అభినందించారు.

బుద్ధవనం నిర్మాణానికి చొరవ చూపింది కేసీఆరే

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : బుద్ధవనం నిర్మాణానికి చొరవ చూపింది కేసీఆర్ ప్రభుత్వమేనని, బుద్ధుడి శాంతియుతత్వాన్ని ఆకలింపు చేసుకున్నందునే ఇది సాధ్యమైందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం బుద్ధిస్టు ఫ్లాగ్ డే సందర్భంగా దిశ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సెమినార్‌లో దేశంలోని బుద్ధిస్టులతోపాటు శ్రీలంక, నేపాల్, మయన్మార్ థాయ్‌లాండ్ దేశాల నుంచి పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. దిశ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ జి.అంబేద్కర్ మాట్లాడుతూ బుద్ధవనం ప్రాజెక్టు తెలంగాణకే తలమానికంగా మారిందని పేర్కొన్నారు. వందల కోట్లు వెచ్చించి ప్రపంచంలోనే ప్రఖ్యాత ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం ఎంతో గర్వకారణమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం బిక్కు, లియాకత్ అలీ బిక్కు, ప్రముఖ బుద్ధిస్ట్ కళాకారుడు పాలమూరు గోపాల్, రఘుపతిరావు, రాజేందర్‌రావు, అంతర్జాతీయ బుద్ధిస్టు సంస్థల ప్రతినిధులు, ప్రొఫెసర్లు, పరిశోధన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్‌పై సర్దార్ విగ్రహం ప్రతిష్ఠించాలి

గౌడ ఐక్య సాధన సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, పల్లె రవి కుమార్, అంబాల నారాయణ గౌడ్

రవీంద్రభారతి, జనవరి 8: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి నాటికి ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పైన ప్రతిష్ఠించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన వైస్సీషాపుల్లో గౌడ కులస్థులకు 25 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని ఎక్సైజ్, సాంస్కృతిక, పర్యాటక శాఖ మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలరోజులు దాటిపోయిందని, ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను తప్పకుండా అమలు చేసి ప్రజల మన్నలను పొందాలని ఆయన చెప్పారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గౌడ ఐక్య సాధన సమితి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి మాజీ మంత్రి డా.వి. శ్రీనివాస్ గౌడ్ విచ్చేశారు. అనంతరం, క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గౌడ కులస్థులు పార్టీలకు అతీతంగా గౌడ హక్కులను సాధించే దిశగా పోరాడాలని ఆయన సూచించారు. అమలు కాని వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కల్లు గీత సంఘం మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్, గౌడ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్, బబ్బూరు భిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 24 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవం

జూబ్లీహిల్స్, జనవరి 8: సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాదాపూర్ లోని శిల్పారామంలో ఈ నెల 24 నుంచి 28 వరకు 'హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం' నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వైఎస్ఎస్.కృష్ణ, వయోలిన్ వాసు, వాసుదేవన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్యాగరాజు జ్ఞాపకార్థం త్యాగరాజ ఆరాధ్యులతో పాటు సంగీతాభిమానులను, నగరంలోని కర్ణాటక సంగీత ప్రియులను రంజింపచేసేందుకు 5 రోజుల పాటు విభిన్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. శిల్పారామంలోని ఎత్నిక్ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రపంచంలోని వేలాది మంది కార్యకర్తలతో ప్రారంభించనున్నట్లు తెలిపారు. సంస్కృతి ఫౌండేషన్ ప్రఖ్యాత సంగీత విద్వాంసులు కళారత్న మోదుమూడి సుధాకర్‌ను సన్మానించనున్నారు. గతేడాది సంగీతోత్సవంలో పాల్గొన్న అతిథులను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో సావిత్రి బాయి పూలే స్మారకోపన్యాసంలో పాల్గొన్న వీసీ ప్రొ.నీతారామారావు తదితరులు

సమాజానికి సావిత్రి బాయి జీవితం ఆదర్శం

సిటీబ్యూరో, జనవరి 8(నమస్తే తెలంగాణ)/బంజారాహిల్స్: సావిత్రి బాయి పూలే జీవితం సమాజానికి ఆదర్శప్రాయమని నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపారాణి అన్నారు. ఈ మేరకు సోమవారం బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సావిత్రీబాయి పూలే 193వ జయంతి సందర్భంగా 'సామాజిక న్యాయం కోసం సావిత్రి బాయి పోరాటం' అనే అంశంపై ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన స్మారకోపన్యాసం సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఉపన్యసించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని రంగాలలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడంలో పురుషులు ఆధిపత్యాన్ని ప్రదర్శించారన్నారు. శిశు హత్యా నిరోధక గృహాలను ఏర్పాటు చేశారని, మాతా శిశు మరణాల నిరోధానికి కూడా కృషి చేశారన్నారు. సమాజం ఎదిరించినా ఆమె తన భర్త జ్యోతిరావు పూలే అంత్యక్రియలు తాను నిర్వహించి ఆదర్శవంతమైన మహిళాగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సీతారామారావు మాట్లాడుతూ ఆదర్శ భావాలు కలిగిన సావిత్రి బాయి సమ సమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీఎన్‌రెడ్డి, మహిళాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆనంద్ పవార్, ఈవీఆర్‌ఎం డైరెక్టర్ ప్రొఫెసర్ వడ్డానం శ్రీనివాస్‌తో పాటు పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓయూలో ఎండీహెచ్ఎం పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఉస్మానియాలోని మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం)కు సంబంధించి పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎండీహెచ్ఎం మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 18వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.300 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

మార్చిలో చర్లపల్లి రైల్వే టెర్మినల్ అందుబాటులోకి..

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : చర్లపల్లి రైల్వే టెర్మినల్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వాస్తవానికి గత ఏడాది డిసెంబర్ నాటికే చర్లపల్లి టెర్మినల్‌ను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నప్పటికీ పనులు పూర్తికాలేదు. దీంతో మార్చి నెలాఖరు వరకు టెర్మినల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దాదాపు రూ. 221 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్ అందుబాటులోకి వస్తే.. కాజీపేట్, నల్లగొండ నుంచి వచ్చే రైళ్లు చర్లపల్లి టెర్మినల్ నుంచి తిరిగి వెళ్తాయి. దీంతో సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లకు ఒత్తిడి తగ్గుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

రూ.22,880 కోట్ల భూమిపై.. కబ్జాదారుల కన్ను

- 286 ఎకరాల భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలి
- ప్రైమ్ ప్రాపర్టీస్ సంస్థపై చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వానికి విన్నవించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నరసింహ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈట నరసింహ

రవీంద్రభారతి , జనవరి 8 : కూకట్‌పల్లి గ్రామం, సర్వే నంబర్ 1007లోని కబ్జాకు గురవుతున్న రూ.22,880 కోట్ల విలువచేసే 286 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నరసింహ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దివంగత నవాబ్ రయీస్‌యార్ జంగ్ బహుదూర్‌కు వారసులెవరూ లేరని, అతడికి చెందిన ఈ భూమిని కొంత మంది సంఘ విద్రోహ శక్తులు ఫోర్జరీ రిజిస్ట్రేషన్ పత్రాలను సృష్టించి ఆక్రమించుకుంటున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.చాయాదేవి, సహాయ కార్యదర్శి స్టాలిన్, నిర్గేకంటి శ్రీకాంత్ తదితరులతో కలిసి వివరాలు వెల్లడించారు. నవాబ్ రయీస్‌యార్ జంగ్ బహదూర్ 1960లో మరణించారని, ఆ తర్వాత అతడికి చెందిన భూమిని కుమారుడు ఫజిలత్ హుస్సేన్, అతడి తల్లీ సోదరుడు, సోదరీమణుల పేరుమీదకు మార్చబడిందని చెప్పారు. కాలక్రమేణా ఒక్కొక్కరుగా వారి వారసత్వం అంతా మృతిచెందిందని తెలిపారు. అయితే సాధిక్ మొహియుద్దీన్ అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సృష్టించబడిన నకిలీ డాక్యుమెంట్లతో సొసైటీలు, కంపెనీలు, పలువురు సంఘ విద్రోహ శక్తులు భూములను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రైమ్ ప్రాపర్టీస్ అనే సంస్థ ఆ భూములలో నిర్మాణాలను చేపట్టేందుకు యత్నిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని విచారణ జరిపి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ

కల్లుగీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలు ఇవ్వాలి

చిక్కడపల్లి, జనవరి 8: కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడారు. రాష్ట్రం లో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన వారి కుటుంబాలకు, శాశ్వత వికలాంగులకు రూ.10లక్షలు ఇవ్వాలని, కల్లుగీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు వెంకట నర్సయ్య, అచ్చాలు పాల్గొన్నారు.

మైనర్‌తో అసభ్య ప్రవర్తన.. ఐదేండ్ల జైలు శిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జనవరి 8(నమస్తే తెలంగాణ): వావివరుసలు మరిచి కూతురుతో అసభ్యంగా ప్రవర్తించిన మారుతండ్రి సయ్యద్ వాషే(45)కు ఐదేండ్ల జైలుశిక్ష, పదిహేను వేల జరిమానా విధిస్తూ, బాధితురాలికి లక్ష రూపాయల పరిహారం చెల్లించాలని రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో న్యాయస్థానం తీర్పునిచ్చింది. అదనపు పీపీ సునీత కథనం ప్రకారం.. తండ్రి చనిపోవడంతో బాలిక తల్లి బాలాపూర్ సదత్ నగర్‌కు చెందిన (నిందితుడు) సయ్యద్ వాషేను రెండో పెళ్లి చేసుకుంది. అయితే, బాలికపై కన్నేసిన నిందితుడు అనేకసార్లు అసభ్యంగా ప్రవర్తించాడు. 2022, డిసెంబర్ 24న మైనర్ బాలిక పట్ల నిందితుడు అసభ్యంగా ప్రవర్తిస్తుండగా తల్లి నిద్రలేచి చూసి నిలదీసింది. దీంతో సయ్యద్ పారిపోయాడు. జరిగిన ఉదంతంపై బాలిక తల్లి బాలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. తదుపరి దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం.. నిందితుడు సయ్యద్ వాషేకు జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా మధుసూదన్

అంబర్‌పేట, జనవరి 8: ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా సాదుల మధుసూదన్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రమేశ్‌రావు, కోశాధికారిగా రాఘవేందర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. రాష్ట్ర శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివరాత్రి యాదగిరి, అధికార ప్రతినిధిగా జయసింహ గౌడ్, కన్వీనర్‌గా ఐవీ రమణారావులను ఎన్ను

ఆర్గానిక్ మిల్లెట్స్‌పై ఇక్రిసాట్ ప్రదర్శన

చిరుధాన్యాల వినియోగం, సాగు ఉత్పత్తుల దిగుబడిని పెంచడమే లక్ష్యంగా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నట్టు ఇక్రిసాట్ పరిశోధకులు వెల్లడించారు. బెంగుళూరు వేదికగా నిర్వహించిన మిల్లెట్స్ అండ్ ఆర్గానిక్స్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో ఇక్రిసాట్ డెవలప్ చేసిన వంగడాలను ప్రదర్శించారు. ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో నూతన వంగడాలపై అవగాహన కల్పించినట్లుగా పరిశోధకులు పేర్కొన్నారు.

పీఆర్‌టీయూ-2024 క్యాలెండర్ ఆవిష్కరణ

జూబ్లీహిల్స్, జనవరి 8 : పీఆర్‌టీయూ హైదరాబాద్ జిల్లా క్యాలెండర్–2024ను సోమవారం నగరంలోని నారాయణగూడ పీఆర్‌టీయూ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు భట్టాపురం మోహన్ రెడ్డి, పూల రవీందర్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బి.మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.తిరుపతి రెడ్డి, చిత్తలూరి ప్రసాద్, పాల్గొన్నారు.

సిడ్బి ఆధ్వర్యంలో స్వావలంబన్ మేళా

సిటీబ్యూరో, జనవరి 8 (నమస్తే తెలంగాణ): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న నుమాయిష్‌లో భారతీయ చిన్న తరహా పరిశ్రమల బ్యాంకు (సిడ్బి) ఆధ్వర్యంలో సోమవారం స్వావలంబన్ మేళా నిర్వహించారు. బ్యాంకు సీజీఎంలు డాక్టర్ సుబ్రాంశు ఆచార్య, సందీప్ వర్మ, హిమాన్షు ఆస్తానా, డీజీఎంలు ప్రభావతి, విద్యాసాగర్, కంచన్‌లతా పాండే, రామకృష్ణ, శివకుమార్, పాల్గొన్నారు.

ఉద్యమకారులకు 100రోజుల్లో ఇంటి స్థలాలు ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8 : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన విద్యార్థి ఉద్యమకారులను గుర్తించి, ఇంటి స్థలాలు ఇవ్వాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ 2009 నుంచి 2014 వరకు క్రియాశీలకంగా పనిచేసిన ప్రతి ఉద్యమకారుడిని ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 100 రోజుల్లో ఉద్యమకారులకు డబుల్ బెడ్ రూంఇండ్లు, 250 గజాల ఇంటి స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులపై నాటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నమోదు చేసిన అన్ని కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి అమరుల స్మారక స్థూపం ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థి ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర పోరాట యోధులుగా గుర్తింపు పత్రాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, సంక్షేమ కార్యక్రమాల అమలును పర్యవేక్షించేలా చూడాలని అభిప్రాయపడ్డారు. పిడమర్తి రవి, కోట శ్రీనివాస్‌గౌడ్, కంచర్ల బద్రి, సంగమేశ్వర్, కందుల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, నంద్రు నర్సింహారావు, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, శెట్టి తదితరులు పాల్గొన్నారు.

సమావేశం అనంతరం ఆర్ట్స్